
# సాక్షి శ్రీసత్యసాయి జిల్లా

మంగళవారం । 14 । మే । 2024

## నిఘా నీడలో పోలింగ్

సోమవారం పోలింగ్ ప్రక్రియ నిఘా నీడలో సాగింది. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు పటిష్ట బందోబస్తు నిర్వహించారు. 8లో



## పలు మండలాల్లో వర్షం

వరుణుడు కరుణించాడు. సోమవారం జిల్లాలోని పలు ప్రాంతాల్లో వర్షించాడు. భగభగ మండే ఎండలతో అల్లాడిపోయిన జనం ఊరట చెందారు. 8లో

గరిష్టం/కనిష్టం
38.2°/21.9°

జిల్లావ్యాప్తంగా సోమవారం ఉష్ణోగ్రతలు తగ్గాయి. ఉక్కపోత, వడగాల్పుల తీవ్రత కొనసాగింది. గంటకు 6 నుంచి 10 కిలోమీటర్ల వేగంతో గాలి వీచింది.

## న్యూస్‌రీల్

### ఓటు మన బాధ్యత



ఓటు వేసి సిరా గుర్తు చూపుతున్న కలెక్టర్ అరుణ్‌బాబు దంపతులు

పుట్టపర్తి అర్బన్: మంచి నాయకులను ఎన్నుకునేందుకు ప్రజాస్వామ్యం మనకిచ్చిన వజ్రాయుధం ఓటు అని, ప్రతి పౌరుడి బాధ్యతగా ఓటు వేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ అరుణ్‌బాబు పిలుపునిచ్చారు. సోమవారం కలెక్టర్ దంపతులు పుట్టపర్తిలోని 107ఏ పోలింగ్ కేంద్రంలో ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రలోభాలకు తలొగ్గకుండా ప్రతి ఒక్కరూ నిజాయతీగా ఓటువేసి ఓటు పవిత్రతను కాపాడాలని పిలుపునిచ్చారు.

### బామ్మా.. నీ స్ఫూర్తికి సలాం



రొద్దంలో ఓటు వేయడానికి వచ్చిన 102 ఏళ్ల వృద్ధురాలు

రొద్దం: ఓటరు చైతన్యానికి ఈ బామ్మ నిలువెత్తు నిదర్శనంగా నిలిచారు. వయస్సు మీదపడినా...శరీరం సహకరించకపోయినా తన బాధ్యత నెరవేర్చారు. సోమవారం జరిగిన సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌లో రొద్దంకు చెందిన 102 ఏళ్ల వృద్ధురాలు హనుమక్క బంధువుల సాయంతో పోలింగ్ కేంద్రానికి వచ్చి ఓటు హక్కును వినియోగించుకున్నారు.

### స్ట్రాంగ్ రూంలకు చేరిన ఈవీఎంలు



ఈవీఎంలను స్ట్రాంగ్ రూంకు పంపుతున్న పుట్టపర్తి ఆర్‌ఓ భాగ్యరేఖ

పుట్టపర్తి అర్బన్: పోలింగ్ ముగిసిన తర్వాత ఆయా నియోజకవర్గాల ఈవీఎంలను పోలీసు భద్రత మధ్య స్ట్రాంగ్ రూంలకు చేర్చారు. పోలింగ్ పూర్తి కాగానే జిల్లాలోని 1,571 కేంద్రాల నుంచి 483 ప్రత్యేక వాహనాల ద్వారా వీటిని తరలించారు. పుట్టపర్తి, ధర్మవరం అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించిన ఈవీఎంలను లేపాక్షి మండలం చోళసముద్రం వద్ద ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో ఏర్పాటు చేసిన రెండు రిసెప్షన్ కేంద్రాలకు చేర్చారు. అలాగే మడకశిర, హిందూపురం, పెనుకొండ, కదిరి అసెంబ్లీ నియోజక వర్గాలకు సంబంధించిన ఈవీఎంలను హిందూపురం మండలం మలుగూరు వద్ద ఉన్న 'బిట్' కళాశాలలో ఏర్పాటు చేసిన నాలుగు రిసెప్షన్ కేంద్రాలకు చేర్చారు. అలాగే రాప్తాడు అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించిన ఈవీఎంలను అనంతపురం జేఎన్‌టీయూ రిసెప్షన్ సెంటర్‌కు చేర్చారు. ఎన్నికల కమిషన్ షెడ్యూల్ ప్రకారం జూన్ నెల 4వ తేదీన మంగళవారం అభ్యర్థుల సమక్షంలో వీటిని తెరిచి ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు.

## పెరిగిన పోలింగ్ శాతం

గతంలో పోలిస్తే ఈ సారి జిల్లాలో పోలింగ్ శాతం పెరిగింది. అధికారిక సమాచారం మేరకు సాయంత్రం 6 గంటలకే 74.70 శాతం పోలింగ్ జరిగింది. రాత్రి 11 గంటల వరకూ ఓటింగ్ జరిగిన నేపథ్యంలో ఇది మరింత పెరగనుంది.



| | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|
| హిందూపురం పార్లమెంట్ | 6.82% | 17.20% | 38.57% | 56.83% | 63.20% | 70.23% | 74.70% |
| రాప్తాడు నియోజకవర్గం | 7.25% | 11.14% | 41.27% | 55.33% | 63.61% | 68.28% | 73.01% |
| మడకశిర నియోజకవర్గం | 3.05% | 29.00% | 46.20% | 63.40% | 66.20% | 71.25% | 74.25% |
| హిందూపురం నియోజకవర్గం | 9.52% | 21.83% | 42.68% | 53.72% | 60.36% | 67.22% | 73.32% |
| పెనుకొండ నియోజకవర్గం | 9.49% | 22.25% | 39.50% | 56.19% | 62.62% | 72.39% | 78.77% |
| పుట్టపర్తి నియోజకవర్గం | 3.18% | 11.00% | 29.29% | 59.74% | 64.12% | 72.33% | 75.22% |
| ధర్మవరం నియోజకవర్గం | 6.01% | 13.41% | 25.23% | 56.71% | 62.20% | 72.25% | 76.10% |
| కదిరి నియోజకవర్గం | 8.71% | 11.80% | 45.83% | 56.77% | 63.32% | 67.92% | 72.24% |



ఓటు వేశాం: నూతన ఓటరు ఆనందం



బాధ్యత: వీల్ చైర్‌లో వచ్చిన వృద్ధురాలు

# ఓటెత్తారు

మండుటెండను లెక్క చేయలేదు. వర్షం వచ్చినా పట్టించుకోలేదు. అందరికీ ఒకటే సంకల్పం. మంచికి ఓటెత్తాలన్న దృఢ నిశ్చయం. అందుకే ఉదయమే పోలింగ్ కేంద్రాల ఎదుట బారులు తీరారు. నడవలేని స్థితిలో ఉన్న వృద్ధులు సైతం కుటుంబీకుల సాయంతో తరలి వచ్చారు. దేశ, విదేశాల్లో ఉన్నవారూ సొంతూళ్లకు వచ్చారు. మారిన గ్రామాలను చూసి మంచికి మద్దతు పలికారు. ఓటరు చైతన్యాన్ని చాటారు. వర్షం ప్రభావం..ఈవీఎంలు మొరాయించడంతో రాత్రి 11 గంటల వరకూ జిల్లాలో పోలింగ్ కొనసాగింది.

- చెదురుమదురు ఘటనలు మినహా పోలింగ్ ప్రశాంతం
- జిల్లాలో భారీగా పెరిగిన ఓటింగ్ శాతం
- ఉదయం నుంచి పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరిన ఓటర్లు
- తరలివచ్చిన వృద్ధులు, మహిళలు, యువత
- అక్కడక్కడా టీడీపీ నాయకుల ఓవర్ యాక్షన్
- సాయంత్రం జిల్లా వ్యాప్తంగా వర్షాలు
- రాత్రి 11 గంటల వరకూ కొనసాగిన ఓటింగ్



ఓ పోలింగ్ కేంద్రం ఎదుట బారులు తీరిన మహిళలు



చంటిబిడ్డలతో వచ్చి ఓటు వేసిన మహిళలు

సాక్షి, పుట్టపర్తి

సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌లో ప్రజలు ఓటెత్తారు. ఓటు హక్కు వినియోగించుకునేందుకు పోలింగ్ కేంద్రాల ఎదుట బారులు తీరారు. సోమవారం జిల్లాలోని వివిధ నియోజకవర్గాల పరిధిలో జరిగిన పోలింగ్ రాత్రి 11 గంటల వరకు కొనసాగింది. అధికారవర్గాలు అందించిన ప్రకారం సాయంత్రం 6 గంటలకు జిల్లాలో 74 శాతం మేర పోలింగ్ జరిగింది. రాత్రి పొద్దుపోయే దాకా పోలింగ్ కొనసాగడం వల్ల ఆ సమాచారం అందితే పోలింగ్ శాతం మరింత పెరిగే అవకాశం ఉంది.

**మందకొడిగా ప్రారంభమైనా...**

వర్షం కారణంగా ఉదయం పోలింగ్ మందకొడిగా సాగినా.. ఆ తర్వాత పుంజుకుంది. సుదూర ప్రాంతాల్లో ఉంటున్న వారు సైతం ఓటు వేసేందుకు ఆదివారం సాయంత్రానికే స్వగ్రామాలకు చేరుకున్నారు. అందువల్లే ఉదయం నుంచి సాయంత్రం వరకు పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్ల సందడి నెలకొంది. చిన్నపిల్లలతో బాలింతలు, మరొకరి సాయంతో వృద్ధులు, దివ్యాంగులు, మహిళలు భారీగా తరలివచ్చారు. దీంతో పోలింగ్ కేంద్రాలన్నీ ఓటర్లతో కిటకిటలాడాయి. ఎమ్మెల్యే అభ్యర్థులూ సామాన్య ప్రజలతో పాటు క్యూలో నిలబడి ఓటుహక్కు వినియోగించుకున్నారు. అధికారులు పకడ్బందీ ఏర్పాట్లతో చెదురుమదురు ఘటనలు మినహా ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోలేదు. వర్షం కారణంగా కొన్ని చోట్ల పోలింగ్‌కు అంతరాయం కలగగా, మరికొన్ని చోట్ల ఈవీఎంలు మొరాయించాయి. దీంతో రాత్రి పొద్దుపోయే వరకూ పోలింగ్ కొనసాగింది. పోలింగ్ సరళిని కలెక్టర్ అరుణ్ బాబు, ప్రత్యేక పరిశీలకులు అన్బుకుమార్ తదితరులు కలెక్టరేట్లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూం నుంచి పర్యవేక్షించారు. సిబ్బందికి సూచనలు చేస్తూ పోలింగ్ ప్రశాంతంగా జరిగేలా చూశారు.



ధర్మవరం మున్సిపల్ హైస్కూల్ పోలింగ్ బూత్ ఎదుట బారులు తీరిన ఓటర్లు



ధర్మవరం బాలికోన్నత పాఠశాల పోలింగ్ కేంద్రం వద్ద క్యూలో ఉన్న ఓటర్లు



వృద్ధుడికి సాయం చేస్తున్న పోలీసు



హిందూపురంలో వర్షంలోనూ ఓటేసేందుకు వచ్చిన మహిళలు



సిరా గుర్తు చూపుతున్న యువత



కమాండ్ కంట్రోల్ రూం నుంచి పోలింగ్ సరళి పర్యవేక్షిస్తున్న ఎస్పీ, పరిశీలకులు

## 'తమ్ముళ్ల' ఓవరాక్షన్

- బరి తెగించి ప్రజలపై దాడులు
- పోలింగ్ కేంద్రాల్లోకి దూరే యత్నం
- మారణాయుధాలతో తెగబడిన వైనం
- దొంగ ఓట్లు వేసేందుకు ప్రయత్నం
- పోలీసులు రంగంలోకి దిగడంతో సుఖాంతం



రామగిరి మండలం పెద్దకొండాపురంలో పరిటాల శ్రీరామ్‌ను అడ్డుకుంటున్న దృశ్యం

సాక్షి, పుట్టపర్తి ఎన్నికల నిబంధనలు తుంగలో తొక్కి... పోలింగ్ కేంద్రాల వద్ద టీడీపీ కార్యకర్తలు నానా హంగామా చేశారు. మారణాయుధాలతో దాడికి దిగారు. పోలింగ్ కేంద్రాల్లో దూరడంతో పాటు దొంగ ఓట్లు వేసేందుకు ప్రయత్నించారు. జిల్లా వ్యాప్తంగా ప్రశాంతంగా జరిగే పోలింగ్ కేంద్రాల వద్ద అలజడి సృష్టించే ప్రయత్నం చేశారు. అయితే పోలీసులు ఎక్కడికక్కడ జోక్యం చేసుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు.

- పుట్టపర్తి నియోజకవర్గం ఓడీ చెరువు మండలం కుసుమవారిపల్లిలో వైఎస్సార్‌సీపీ మద్దతుదారుడు డీలర్ ఇంద్రప్పపై టీడీపీ అల్లరిమూకలు మారణాయుధాలతో దాడి చేసి గాయపరిచారు.
- పెనుకొండ నియోజకవర్గం రొద్దం మండలం గోనిమేకపల్లిలో టీడీపీ కార్యకర్తలు హల్‌చల్ చేశారు. వైఎస్సార్‌సీపీ మద్దతుదారులపై దాడి చేసేందుకు యత్నించారు. తోపులాటలో పలువురు గాయపడ్డారు. పోలీసులు రంగంలోకి దిగి అదుపు చేశారు.
- పుట్టపర్తి నియోజకవర్గం కొత్తచెరువు మండలం కొడపగానిపల్లిలో దొంగ ఓట్లు వేసేందుకు టీడీపీ కార్యకర్తలు ప్లాన్ చేశారు. అయితే అధికారులు అడ్డుకోవడంతో దాడులకు దిగే ప్రయత్నం చేశారు. పోలీసులు రంగంలోకి దిగి చెదరగొట్టారు.
- హిందూపురంలో ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ, పుట్టపర్తి నియోజకవర్గంలో టీడీపీ అభ్యర్థి పల్లె సింధూరారెడ్డి నిబంధనలు తుంగలో తొక్కారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఓట్లు అభ్యర్థించారు. ఓటర్లతో కరచాలనం చేస్తూ సెల్ఫీలకు ఫోజులు ఇచ్చారు. ఫలితంగా సామాన్యులు ఇబ్బందులు పడ్డారు.

**పోలింగ్‌బూత్ వద్ద పరిటాల శ్రీరామ్ హల్‌చల్..**


రామగిరి మండలం పెద్దకొండాపురంలోని పోలింగ్‌బూత్ వద్ద మాజీ మంత్రి పరిటాల సునీత తనయుడు పరిటాల శ్రీరామ్ తన అనుచరులతో కలసి హల్‌చల్ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా మందీమార్బలంతో పోలింగ్ బూత్‌లోకి వెళ్లేందుకు ప్రయత్నించారు. తాను రాప్తాడు టీడీపీ ఎన్నికల చీఫ్‌నంటూ పోలింగ్ బూత్‌లోకి వెళ్లేందుకు ప్రయత్నించారు. ఈ క్రమంలో అక్కడున్న వారిపై దురుసుగా ప్రవర్తించారు. దీంతో స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు, గ్రామస్తులు తిరగబడి అడ్డుకున్నారు. చీఫ్ ఏజెంట్ అయితే అందుకు సంబంధించిన కాపీ చూపాలంటూ పట్టుబట్టారు. ఇందుకు ఆయన సముఖత చూపకపోవడంతో పరిటాల శ్రీరామ్ గో బ్యాక్ అంటూ నినాదాలు చేశారు. ఈ క్రమంలో ఇరువర్గాల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. పోలింగ్ బూత్ వద్ద ఉద్రిక్తత పరిస్థితి నెలకొంది. దీంతో పోలీసులు వెంటనే అక్కడకు చేరుకుని శ్రీరామ్‌ను వారించి అక్కడి నుంచి పంపించారు.



కొత్తచెరువు మండలం కొడపగానిపల్లిలో దొంగ ఓట్లు వేసేందుకు వచ్చిన పచ్చమూకను చెదరగొడుతున్న పోలీసులు



హిందూపురం 17వ వార్డులో ఓటు వేశాక సిరా గుర్తు చూపుతున్న ఎంపీ అభ్యర్థి శాంతమ్మ



తోపుదుర్తిలో ఓటుహక్కు వినియోగించుకున్న రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి



గుడిబండ మండలం పలారంలో ఓటు వేసిన వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్ప



హిందూపురం: ఎం.బీరేపల్లిలో ఓటు హక్కు వినియోగించుకున్న వైఎస్సార్‌సీపీ అభ్యర్థి టీఎన్ దీపిక



కదిరిలో ఓటు వేస్తున్న వైఎస్సార్‌సీపీ కదిరి ఎమ్మెల్యే అభ్యర్థి బీఎస్ మక్బూల్



కదిరిలో ఓటుహక్కు వినియోగించుకుంటున్న ఎంపీ గోరంట్ల మాధవ్



పాలసముద్రంలో ఓటు వేసిన అనంతరం సిరా గుర్తు చూపుతున్న మంత్రి ఉషశ్రీ చరణ్ దంపతులు

## ఓటేసిన ప్రముఖులు

పోలింగ్ రోజున ప్రముఖులూ ఓటెత్తారు. సామాన్యుల్లా క్యూలో వెళ్లి ఓటు హక్కు వినియోగించుకున్నారు. వైఎస్సార్ సీపీ ఎంపీ అభ్యర్థి శాంతమ్మ, వివిధ నియోజకవర్గాల ఎమ్మెల్యే అభ్యర్థులు కుటుంబీకులతో కలిసి వెళ్లి ఓటు హక్కు వినియోగించుకున్నారు. – సాక్షి బృందం



కుటుంబీకులతో కలిసి ఓటు వేసి సిరా గుర్తును చూపుతున్న పుట్టపర్తి ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి



సిరా గుర్తు చూపుతున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి దంపతులు

## క్లుప్తంగా

### పలు మండలాల్లో వర్షం

అనంతపురం అగ్రికల్చర్: ఆదివారం రాత్రి నుంచి సోమవారం ఉదయం వరకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పలు మండలాల్లో మోస్తరు నుంచి తేలికపాటి వర్షం కురిసింది. దీంతో వేసవి తాపం బాగా తగ్గిపోయింది. రాయదుర్గం, గుడిబండ, కళ్యాణదుర్గం, మడకశిర, గుంతకల్లులో 30 నుంచి 40 మి.మీ, ఉరవకొండ, బ్రహ్మసముద్రం, కంబదూరు, వజ్రకరూరు, కదిరిలో 20 నుంచి 25 మి.మీ, డి.హీరేహాళ్, కణేకల్లు, యాడికి, ఆత్మకూరు, బుక్కపట్నం, తలుపుల, అమరాపురం, కనగానపల్లి, ముదిగుబ్బ తదితర మండలాల్లో 10 మి.మీ పైగా వర్షపాతం నమోదైంది. మిగిలిన మండలాల్లో మోస్తరు నుంచి తేలికపాటి వర్షం కురిసింది.

### ఓటు వేసేందుకు వెళుతూ మృత్యు ఒడికి


వెంకటేశు మృతదేహం

గౌరిబిదనూరు: ఏపీలో జరుగుతున్న సార్వత్రిక ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకునేందుకు స్వగ్రామానికి వెళ్తున్న ఓ వ్యక్తి రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. వివరాలు... హిందూపురం తాలూకా సంతేబిదనూరు గ్రామానికి చెందిన శ్రీనివాసులు కుమారుడు వెంకటేశు (35) బెంగళూరులో నివాసం ఉంటున్నాడు. సార్వత్రిక ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఆదివారం రాత్రి బెంగళూరు నుంచి ద్విచక్ర వాహనంపై బయలుదేరిన ఆయన అర్ధరాత్రి గౌరిబిదనూరు తాలూకాలోని కామలాపురం సమీపంలోకి చేరుకోగానే ఎదురుగా వేగంగా దూసుకొచ్చిన ఆయిల్ ట్యాంకర్ ఢీకొంది. ఘటనలో వెంకటేశు అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటనపై మంచేనహళ్లి పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

### నిఘా నీడలో పోలింగ్


పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ మాధవరెడ్డి

పుట్టపర్తి టౌన్: జిల్లా వ్యాప్తంగా సార్వత్రిక ఎన్నికలు పటిష్ట నిఘా నీడన ప్రశాంతంగా జరిగాయి. జిల్లా పోలీసు కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూం నుంచి వెబ్ క్యాస్టింగ్ ద్వారా పోలింగ్ సరళిని ఎస్పీ మాధవరెడ్డి పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల పరిసర ప్రాంతాల్లో 144 సెక్షన్ అమలు చేశారు. చుట్టుపక్కల వ్యాపార సంస్థలను మూసివేయించారు. అక్కడక్కడ చెదురుముదురు ఘటనలు మినహా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోలేదు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలైన పుట్టపర్తి, ధర్మవరం, సీకేపల్లి, కనగానపల్లి, రామగిరి, ముదిగుబ్బ, బత్తలపల్లి గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను ఎస్పీ మాధవరెడ్డి పరిశీలించారు. కాగా, ఓటు హక్కు వినియోగించుకునేందుకు సుదూర ప్రాంతాల నుంచి ఓటర్లు తరలివచ్చారు. పుట్టపర్తి అర్బన్ సీఐ కొండారెడ్డి ఓవరాక్షన్‌తో ఓటర్లు ఇబ్బంది పడ్డారు.

# రెచ్చిపోయిన పచ్చమూక

సార్వత్రిక ఎన్నికల పోలింగ్ సజావుగా సాగుతున్న సమయంలో టీడీపీ నేతలు, కార్యకర్తలు రెచ్చిపోయారు. ఓటమి భయంతో ఆక్రోశంతో రగిలిపోయారు. ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తూ విధ్వంసాలకు తెగబడ్డారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సోమవారం ఇదే పరిస్థితి కన్పించింది. వైఎస్సార్‌సీపీకి అనుకూలంగా ఓటు వేస్తున్నారన్న భావనతో అక్కసు వెళ్లగక్కారు. పోలింగ్ నిలుపుదలకు కుట్రలు సాగించారు. టీడీపీ నేతల దాష్టీకాలను వైఎస్సార్‌సీపీ అండతో ప్రజలు సమర్థవంతంగా తిప్పి కొట్టారు. గతంలో కంటే ఎక్కువ శాతం ఓటింగ్ అయ్యేలా సహకరించారు.

### చోళసముద్రంలో బరితెగింపు


చోళసముద్రంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తను చుట్టుముట్టి దాడి చేస్తున్న టీడీపీ నేతలు

లేపాక్షి: హిందూపురం నియోజకవర్గం లేపాక్షి మండలం చోళసముద్రం పోలింగ్ కేంద్రం వద్ద టీడీపీ నేతలు బరితెగించారు. సోమవారం సాయంత్రం స్థానిక టీడీపీ నేత, వైఎస్సార్‌సీపీ కార్యకర్త మధ్య చిన్నపాటి గొడవ చోటు చేసుకుంది. దీంతో టీడీపీ నేతలు మూకుమ్మడిగా వైఎస్సార్‌సీపీ కార్యకర్తని చుట్టుముట్టి దాడి చేశారు. అక్కడున్న స్థానికులు జోక్యం చేసుకోవడంతో అప్పటికి వివాదం సద్దుమణిగింది. ఈ విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నారాయణస్వామి వెంటనే ఆయన అక్కడకు చేరుకున్నారు. ఘటనపై ఆరా తీస్తుండగా మరోసారి టీడీపీ నాయకులు, కార్యకర్తలు రెచ్చిపోయారు. సకాలంలో పోలీసులు రంగంలో దిగి లాఠీచార్జ్ చేసి గుంపును చెదరగొట్టారు.

### రెక్కమానులో రచ్చ

గాండ్లపెంట: కదిరి నియోజకవర్గం గాండ్లపెంట మండలం రెక్కమాను పోలింగ్ కేంద్రం వద్ద సోమవారం మధ్యాహ్నం స్వల్ప ఉద్రిక్తత చోటు చేసుకుంది. 174వ పోలింగ్ కేంద్రం పరిధిలో మొత్తం 1,445 మంది ఓటర్లు ఉండగా, మధ్యాహ్నం 2 గంటల సమయానికి 600 ఓట్లు పోలయ్యాయి. అయితే వైఎస్సార్‌సీపీకి ఎక్కువగా ఓట్లు పడుతున్నాయనే ఉద్దేశంతో మధ్యాహ్నం 2.30 గంటలకు పోలింగ్ కేంద్రం వద్ద టీడీపీ కార్యకర్తలు రచ్చరచ్చ చేశారు. సముదాయించబోయిన వైఎస్సార్‌సీపీ నాయకులపై దాడులకు తెగబడ్డారు. దీంతో స్వీయ రక్షణలో భాగంగా ప్రతి దాడులు చోటు చేసుకున్నాయి. ఒకరికి రక్తగాయాలయ్యాయి.

### ఏజెంట్ల కళ్లలో కారం చల్లి....

పుట్టపర్తి రూరల్: పోలింగ్ రోజునే ఓటమి ఖరారు చేసుకున్న టీడీపీ నేతలు ఓటింగ్ ఆపేందుకు విఫలయత్నం చేశారు. ఏకంగా వైఎస్సార్ సీపీ ఏజెంట్ల కళ్లలో కారం చల్లి అలజడులు సృష్టించారు. సోమవారం ఉదయం పుట్టపర్తి మున్సిపాలిటీ పరిధిలోని బ్రాహ్మణపల్లి 104వ బూత్‌లో ఓటు వేసేందుకు పెద్ద సంఖ్యలో ముస్లిం మహిళలు, పురుషులు బారులు తీరారు. వీరంతా వైఎస్సార్‌సీపీ మద్దతుదారులుగా భావించిన టీడీపీ నేతలు ఎలాగైనా పోలింగ్‌ను అడ్డుకోవాలని భావించారు. అదే సమయంలో తాను బటన్ నొక్కినా ఈవీఎం నుంచి స్పందన లేదంటూ ఓ మహిళ అక్కడున్న ఏపీఓకు తెలిపింది. దీంతో ఆయన సాంకేతిక సమస్యను సరిచేసి మరోసారి బటన్ నొక్కాలని చెప్పాడు. అప్పటికే అవకాశం కోసం ఎదురు చూస్తున్న టీడీపీ ఏజెంట్లు రెండు సార్లు ఓట్లు వేయిస్తున్నారంటూ నానా యాగీ చేశారు. అక్కడున్న వైఎస్సార్‌సీపీ ఏజెంట్లు సర్దిచెప్పేందుకు ప్రయత్నించినా వినకుండా దౌర్జన్యంగా బయటకు లాక్కెళ్లి కళ్లలో కారం చల్లారు. సమాచారం అందుకున్న ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి అక్కడకు చేరుకోగానే దుండగులు అక్కడి నుంచి పరారయ్యారు. కాగా, 1,290 ఓట్లు ఉన్న 104 బూత్‌లో అలజడుల కారణంగా ఓటింగ్ సరళి ఆలస్యమైంది. దీంతో రాత్రి 10 గంటల వరకు ఓటింగ్‌కు అధికారులు అవకాశం కల్పించారు.

## దివ్యాంగుడిపై ఇనుప రాడ్‌తో దాడి


టీడీపీ కార్యకర్తల దాడిలో గాయపడిన ఆదినారాయణ

పెద్దవడుగూరు: తాడిపత్రి నియోజకవర్గం పెద్దవడుగూరు మండల వ్యాప్తంగా సోమవారం ఉద్రిక్త వాతావరణం చోటు చేసుకుంది. ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రారంభం కాగానే మిడుతూరు, పి.వీరన్నపల్లి, దిమ్మగుడి తదితర గ్రామాల్లో ఇరుపార్టీల కార్యకర్తల మధ్య మాటల యుద్ధం మొదలైంది. మిడుతూరు నడవలేని స్థితిలో ఉన్న వృద్ధురాలిని ఓ వైఎస్సార్‌సీపీ కార్యకర్త పోలింగ్ కేంద్రంలోకి తీసుకెళ్లడంతో టీడీపీ కార్యకర్తలు అడ్డుకున్నారు. ఆ సమయంలో రెండు వర్గాల మధ్య వాగ్వాదం చెలరేగింది. వెంటనే పోలీసులు జోక్యం చేసుకుని పరిస్థితిని చక్కదిద్దారు. వీరన్నపల్లిలో ఓటర్లను టీడీపీ నేతలు ప్రభావితం చేస్తుండగా వైఎస్సార్‌సీపీ నాయకులు అడ్డుకున్నారు. అక్కడే ఉన్న పోలీసులు రంగ ప్రవేశం చేసి ఇరువర్గాల వారిని చెదరగొట్టారు. దిమ్మగుడిలో జెడ్పీ ఉన్నత పాఠశాలలో వాచ్‌మెన్‌గా పని చేస్తున్న ఆదినారాయణ పోలింగ్ కేంద్రం వద్ద ఓటర్లకు ఏర్పాటు చేసిన వాటర్ క్యాన్‌లను మారుస్తుండగా టీడీపీ నాయకులు రామిరెడ్డి, రాజారెడ్డి, నవీన్‌కుమార్‌రెడ్డి కులం పేరుతో దూషణలకు దిగారు. దివ్యాంగుడైన ఆదినారాయణను బండిపై నుంచి కిందకు తోసేశారు. అంతలో అక్కడికి చేరుకున్న టీడీపీ కార్యకర్తలు నగేష్, రాజు, మల్లికార్జున, ఓబులేసు అప్పటికే సిద్ధంగా ఉంచుకున్న ఇనుపరాడ్లతో దాడి చేయడంతో ఆదినారాయణ తలకు తీవ్ర గాయమైంది. పోలీసులు పరుగున వస్తుండడం గమనించిన దౌర్జన్యపరులు అక్కడి నుండి పరారయ్యారు. క్షతగాత్రున్ని స్థానికులు చికిత్స నిమిత్తం పామిడిలోని సీహెచ్‌సీకి తరలించారు.

### తనకల్లులో ఉద్రిక్తత

తనకల్లు: కదిరి నియోజకవర్గం తనకల్లు పంచాయతీ పరిధిలోని రెడ్డివారిపల్లిలో 1,110 ఓటర్లు కలిగిన 255వ పోలింగ్ కేంద్రం వద్ద మధ్యాహ్నం 2.30 గంటలకు ఉద్రిక్తత నెలకొంది. రాచువారిపల్లికి చెందిన ఓటరు దేశాయి గౌతంరెడ్డి ఓటు వేసేందుకు పోలింగ్ కేంద్రం వద్దకు వచ్చారు. ఆ సమయంలో క్యూలైన్ అడ్డదిడ్డంగా ఉండడంతో సక్రమంగా వెళ్లాలని ఆయన సూచించారు. అయితే అప్పటికే ఓటమి భయంతో చిరాకుతో ఉన్న టీడీపీ నాయకులు... గౌతంరెడ్డిపై మూకుమ్మడిగా కలబడ్డారు. మా ఊళ్లోకి వచ్చి నీవెవరు చెప్పడానికంటూ చేతికి అందిన రాళ్లు, కర్రలతో విరుచుకుపడ్డారు. దాడిలో గౌతంరెడ్డి కారు ధ్వంసమైంది.ఘటనపై బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

### ఓబుళాపురంలో కర్రలతో దాడి

పుట్లూరు: మండలంలోని ఓబుళాపురం గ్రామ ఆర్డీటీ పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్‌కు ఉదయం నుంచి వైఎస్సార్‌సీపీ మద్దతుదారులే అధికంగా రావడంతో జీర్ణించుకోలేని టీడీపీ నాయకులు రెచ్చిపోయారు. మూకుమ్మడిగా కర్రలతో దాడికి తెగబడడంతో అదే గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నేతలు పూజారి కృష్ణయ్య, వెంకటకృష్ణ, రమణ, సుధాకర్, రాజు తీవ్రంగా గాయపడ్డారు. వీరిలో కృష్ణయ్య పరిస్థితి విషమంగా ఉండడంతో అనంతపురానికి రెఫర్ చేశారు.

## అడుగడుగునా పోలింగ్‌కు ఆటంకం

- టీడీపీ నేతల దుశ్చర్య
- రాళ్ల దాడిలో గాయపడిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త


టీడీపీ నేతల రాళ్ల దాడిలో గాయపడిన నవీన్

చిలమత్తూరు: మండల వ్యాప్తంగా వైఎస్సార్‌సీపీ అనుకూలంగా ఓటింగ్ జరుగుతుండడం గమనించిన టీడీపీ నేతలు ఓర్వలేకపోయారు. ఎలాగైనా పోలింగ్‌ను అడ్డుకోవాలని భావించి దుశ్చర్యకు తెరలేపారు. ఈ క్రమంలో దాడులకు తెగబడి అడుగడుగునా పోలింగ్‌కు ఆటంకం కలిగించారు. వివరాలు... చిలమత్తూరు మండలం వీరాపురం పంచాయతీ హుస్సేన్‌పురంలో సోమవారం ఉదయం ఓటింగ్ సరళిని పరిశీలించేందుకు ఎంపీపీ పురుషోత్తంరెడ్డి వచ్చారు. స్థానిక వైఎస్సార్‌సీపీ నేతలను కలసి ప్రశాంతయుత వాతావరణంలో పోలింగ్ జరిగేలా చూడాలని సూచించారు. అనంతరం ఆయన తిరుగు ప్రయాణమయ్యారు. అదే సమయంలో టీడీపీ నేతలు రెచ్చిపోయి పెద్ద ఎత్తున రాళ్లు రువ్వారు. ఘటనలో ఎంపీపీ ప్రయాణిస్తున్న కారు ధ్వంసమైంది. డ్రైవర్ వాహనాన్ని ఆపడంతో ఎంపీపీపై హత్యాయత్నం చేశారు. ఆ సమయంలో అడ్డుపడిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త నవీన్ తలకు బలమైన గాయాలయ్యాయి. టీడీపీ నేతల దౌర్జన్యాన్ని సహించలేని గ్రామస్తులు మూకుమ్మడిగా తిరగబడడంతో పరిస్థితి అదుపులోకి వచ్చింది.

- కొత్తచామలపల్లిలో పోలింగ్ ఆలస్యం కావడంతో రాత్రి ఏడున్నర గంటలకు పైగా కొనసాగించారు. ఓ వైపు టీడీపీ నాయకులు రిగ్గింగ్ జరిగిందంటూ పోలింగ్ ఆపే ప్రయత్నాలు చేసి వైఎస్సార్‌సీపీ నేతలను రెచ్చగొట్టారు. గొడవ పెద్దది అవుతుండటంతో అప్రమత్తమైన పోలీసులు ఇరు వర్గాలను చెదరగొట్టారు.
- కనిశెట్టిపల్లిలో టీడీపీ నేతలు ఓటమి భయంతో పోలింగ్‌ను ఆపే ప్రయత్నం చేశారు. దాడులకు తెగబడి, ఓటర్లను భయభ్రాంతులకు గురిచేశారు.
- చిలమత్తూరుకు బాలకృష్ణ వస్తున్నాడని తెలుసుకున్న టీడీపీ నేతలు పోలింగ్ కేంద్రం వద్ద గుమిగూడారు. ఆ సమయంలో వారిని అక్కడి నుంచి వెళ్లిపోవాలంటూ సూచించిన పోలీసులపై దురుసుగా వ్యవహరించారు.

## ఆహ్లాదకరమైన వాతావరణంలో పోటెత్తిన ఓటర్లు


పాతూరు 15వ వార్డు బూత్‌లో ఉదయం 7.30 గంటలకే బారులు తీరిన ఓటర్లు

అనంతపురం అగ్రికల్చర్: సరిగ్గా పోలింగ్ రోజున ఆహ్లాదకరమైన వాతావరణం ఏర్పడడంతో సోమవారం పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లు పోటెత్తారు. రెండు నెలలుగా 42 నుంచి 45 డిగ్రీలతో సూరీడు సెగలు పుట్టించిన విషయం తెలిసిందే. ఉదయం 10 గంటలకు కూడా బయటకు రావడానికి ప్రజలు బెంబేలెత్తిపోయారు. ఉక్కపోత, వడగాల్పుల తీవ్రతతో రెండు నెలలుగా జనం ఉక్కిరిబిక్కిరయ్యారు. ఈ క్రమంలో పోలింగ్ రోజు ఓటు వేయడానికి జనం రారని అందరూ భావించారు. అలాంటిది సరిగ్గా పోలింగ్ రోజునే ఈ సీజన్‌లోనే తొలిసారిగా చిరుజల్లుల నడుమ చల్లటి వాతావరణం నెలకొంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఆదివారం అర్ధరాత్రి నుంచి ఒక్కసారిగా వాతావరణం మారిపోయి మోస్తరుగా వర్షం కురిసింది. దీంతో పోలింగ్ స్టేషన్లకు ఉదయం నుంచి సాయంత్రం 6 గంటల వరకు జనం తగ్గలేదు. దాదాపు అన్ని పోలింగ్ స్టేషన్లు ఓటర్లతో కిటకిటలాడాయి. కొన్ని పోలింగ్‌స్టేషన్లలో కొన్ని బూత్‌లు మాక్‌పోలింగ్ తర్వాత గంట, గంటన్నర పాటు మొరాయించడం, వాటి స్థానంలో కొత్తవి ఏర్పాటు చేసిన ప్రాంతాల్లో మాత్రమే సాయంత్రం 6 గంటల తర్వాత కూడా పోలింగ్ జరిగింది.

### ఓటు హక్కు వినియోగించుకున్న ఎన్‌ఆర్‌ఐ


ఓటు హక్కు వినియోగించుకున్న ఎన్‌ఆర్‌ఐ హనుమంతరెడ్డి

పుట్టపర్తి: ఓటు వేసేందుకు విదేశాల నుంచి సైతం సొంతూళ్లకు పలువురు వచ్చారు. బుక్కపట్నం మండలం బుచ్చయ్యగారిపల్లికి చెందిన హనుమంతరెడ్డి లండన్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నారు. కుటుంబ సభ్యులతో కలసి వచ్చిన ఆయన సోమవారం స్వగ్రామంలో ఓటు హక్కు వినియోగించుకున్నారు. అలాగే పుట్టపర్తికి చెందిన ఓ దివ్యాంగుడు కుటుంబసభ్యుల సహకారంతో వీల్‌చైర్‌లో వచ్చి స్థానిక ఆదర్శ ప్రాథమిక పాఠశాలలో ఓటు హక్కు వినియోగించుకున్నాడు.

### పచ్చకండువాతో బాలయ్య హల్‌చల్


ఓటర్లతో కరచాలనం చేస్తూ ప్రభావితం చేస్తున్న బాలకృష్ణ

హిందూపురం టౌన్: ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ పోలింగ్ కేంద్రం వద్ద పచ్చకండువా వేసుకుని హల్‌చల్ చేశారు. ఓటు వేయడానికి వచ్చిన ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తూ టీడీపీ కండువాతో క్యూ లైన్‌లో నిలబడ్డారు. అనంతరం పలు పోలింగ్ కేంద్రాలను సందర్శిస్తూ ఓటర్లను ప్రభావితం చేశారు.

### విద్యుత్ తీగలు మీద పడి రైతు మృతి

- కరెంట్ షాక్‌తో మృతి చెందిన గేదె, పాము


మృతి చెందిన రైతు నరసింహారెడ్డి, పాడిపశువు

మడకశిర: ప్రమాదవశాత్తు విద్యుత్ తీగలు మీద పడడంతో ఓ రైతు, గేదెతో పాటు ఓ పాము కూడా మృతి చెందింది. వివరాలు.. మడకశిర మండలం చీపులేటి గ్రామానికి చెందిన రైతు నరసింహారెడ్డి(60) సోమవారం ఉదయం తన గేదెను మేపు కోసం పొలం వద్దకు తోలుకెళ్లాడు. కంచె పక్కగా గేదెను మేపుతుండగా ఉన్నఫళంగా విద్యుత్ లైన్ తీగలు తెగి రైతు, గేదెపై పడ్డాయి. దీంతో రైతుతో పాటు గేదె కూడా మృతి చెందింది. అదే సమయంలో అటుగా వచ్చిన పాము సైతం కరెంట్ షాక్‌తో మృతి చెందింది. విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యమే ఘటనకు కారణమని మృతుడి కుటుంబసభ్యులు ఆరోపించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.


మృతి చెందిన పాము


కదిరి కుటాగుళ్ల పోలింగ్ కేంద్రం వద్ద క్యూలో నిల్చున్న ఓటర్లు


రొద్దం మండలంలో బారులు తీరిన ఓటర్లు

### ఉత్సాహంగా ఓటింగ్

ఉమ్మడి అనంతపురం జిల్లాలో రెండు నెలలపాటు నిప్పులు కురిపించిన సూరీడు శాంతించాడు. వాతావరణం చల్లగా మారింది. ఐదేళ్లకొకసారి వచ్చే అతిపెద్ద ఎన్నికల పండుగకు ఓటర్లు పోటెత్తారు. సోమవారం ఉదయం ఆరు గంటల నుంచే పోలింగ్ కేంద్రాల వైపు అడుగులు వేశారు. ఈసారి మహిళలు, వృద్ధులు, దివ్యాంగులు, నూతన ఓటర్లు, సాధారణ ఓటర్లు అందరూ బాధ్యతగా కదిలారు. ఊతకర్ర చేతపట్టి కొందరు.. శక్తిని కూడదీసుకుని ఇతరుల సహాయంతో మరికొందరు.. వీల్‌చైర్లు.. మూడుచక్రాల సైకిళ్లపై ఇంకొందరు.. ఇలా ప్రతి ఒక్కరూ ఉల్లాసంగా.. ఉత్సాహంగా కదిలొచ్చారు. ఓటు విలువను గుర్తెరిగి మన భవిష్యత్తుకు భరోసా ఇచ్చే వారు ఎవరో నిర్ణయించుకుని ఓటు వేశారు. ఎవరు ఎన్ని ప్రలోభాలు పెట్టినా తమ మదిలో ముద్రితమైన అభ్యర్థి–పార్టీకి ఈవీఎంపై బటన్ నొక్కారు. – సాక్షి బృందం


నల్లమాడ మండలం రెడ్డిపల్లిలో తొలిసారి ఓటు వేసిన ఆనందంలో విద్యార్థిని వానెల్లి సోని


కొత్తచెరువులో ఓటరు స్లిప్పులు చూపుతున్న మహిళలు


హిందూపురం మోడల్ కాలనీలో బారులు తీరిన ఓటర్లు


పుట్టపర్తి మండలం జగరాజుపల్లిలో ఓటర్ల క్యూ


సోమందేపల్లిలో కాలువిరిగిన ఓటరును ఓటు వేయడానికి మోసుకొస్తున్న యువకుడు



మడకశిర మండలం ఉప్పిడిపల్లి పోలింగ్ కేంద్రం వద్ద ఓటు వేయడానికి క్యూలో కూర్చున్న మహిళలు, ధర్మవరంలోని గిర్రాజు కాలనీలో...


ఓటు వేస్తున్న ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి సతీమణి అపర్ణారెడ్డి


నల్లమాడ మండలం సీ.బడవాండ్లపల్లి పోలింగ్ బూత్ వద్ద క్యూ కట్టిన మహిళా ఓటర్లు


పాతబత్తలపల్లిలో వీల్‌చైర్‌లో వృద్ధురాలిని పోలింగ్ బూత్‌కు తీసుకొస్తున్న దృశ్యం


మండలపల్లి పోలింగ్ కేంద్రంలో ఓటేసేందుకు వృద్ధుడిని వీల్‌చైర్‌లో తీసుకొస్తున్న దృశ్యం


కొట్లపల్లిలో క్యూలో ఉన్న ఓటర్లు

# పోలింగ్ ప్రశాంతం

- చెదురు మదురు ఘటనలు మినహా సజావుగా పోలింగ్
- పెద్ద ఎత్తు పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చిన మహిళలు
- కొన్ని ప్రాంతాల్లో రాత్రి 10 గంటల దాకా ఓట్లు
- పుట్టపర్తి, పెనుకొండ నియోజకవర్గాల్లో కట్టుదిట్టమైన పోలీసు భద్రత

**పుట్టపర్తి అర్బన్:** పుట్టపర్తి నియోజక వర్గంలో సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. చెదురుమదురు సంఘటనలు మినహా దాదాపు అన్ని మండలాల్లో ఓటర్లు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకున్నారు. ఉదయం 6.30 గంటలకే పోలింగ్ కేంద్రాల వద్ద బారులుదీరారు. ఉదయం చిన్నపాటి వర్షం, మధ్యాహ్నం కాసేపు ఎండ, సాయంత్రం వర్షంకురిసింది. ఓటర్లు వర్షాన్ని లెక్కచేయకుండా క్యూలో ఉండి ఓటు హక్కు వినియోగించుకున్నారు. నియోజక వర్గంలోని పుట్టపర్తి అర్బన్, రూరల్, కొత్తచెరువు, బుక్కపట్నం, నల్లమాడ, ఓడీ చెరువు, అమడగూరు మండలాల్లో 2,11,062 మంది ఓటర్లు ఉన్నారు. మొత్తం 241 పోలింగ్ కేంద్రాలు ఉండగా పోస్టల్ బ్యాలెట్లు సుమారు 2,143 మంది వినియోగించుకున్నారు. తక్కిన ఓటర్లు సోమవారం పోలింగ్ కేంద్రాలకు వెళ్లి ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఇందు కోసం సుమారు 1156 మంది ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

**లేపాక్షి అంబేద్కర్ గురుకుల పాఠశాలలో ఈవీఎంలు భద్రం**

ఓటింగ్ పూర్తి అయిన ఈవీఎంలను లేపాక్షి సమీపంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో భద్రపరిచారు. ఉదయం 9 గంటలకు కేవలం 3.18 శాతం, 11 గంటలకు 18.84 శాతం, 1 గంటలకు 29.29 శాతం, 3 గంటలకు 59.74 శాతం, సాయంత్రం 4 గంటలకు 64.12 శాతం, 5 గంటలకు 72.33 శాతం, 6 గంటలకు 75.22 శాతం అంటే సుమారు 1.59 లక్షల మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. అయితే రాత్రి 8 గంటల వరకూ చాలా చోట్ల క్యూలైన్లలో ఓటర్లు నిలుచున్నారు. నియోజకవర్గంలో రాత్రి 11 గంటలకు పోలింగ్ పూర్తి కావొచ్చని ఆర్‌ఓ భాగ్యరేఖ పేర్కొన్నారు.

సోమవారం ఉదయం ఓటింగ్ తో పాటు చిన్నపాటి చినుకులు ప్రారంభమయ్యాయి. మధ్యాహ్నం కొంత సేపు ఎండ ప్రభావం చూపినా సాయంత్రానికి వర్షం కురవడంతో ఇదంతా జగనన్న ను వరుణదేవుడు ఆశీర్వదిస్తున్నారని ఓటర్లు పేర్కొనడం విశేషం. వర్షాన్ని కూడా లెక్క చేయకుండా క్యూలో నిలబడి ఓటు హక్కు వినియోగించుకోవడం విశేషం.

**రొద్దం:** మండల వ్యాప్తంగా ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. 48 బూత్‌లలో సోమవారం ఉదయం 7 గంటల నుంచే పోలింగ్ ప్రారంభమైంది. సాయంత్రం 7 గంటల దాకా పోలింగ్ కొనసాగింది. ఓటర్లు పెద్ద ఎత్తున తరలివచ్చి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక, జిల్లా ఉన్నత పాఠశాలలో జరుగుతున్న ఎన్నికల ప్రక్రియను వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి ఉషశ్రీచరణ్ పరిశీలించారు. ఉదయం మండల కేంద్రంలో ఎస్పీ మాధవరెడ్డి ఎన్నిక ప్రక్రియను పరిశీలించారు.

**గోరంట్ల:** మండలంలో సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. సోమవారం ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రారంభమైంది. చెదురు మదురు ఘటనలు మినహా పోలింగ్ సజావుగా సాగింది. మండల వ్యాప్తంగా 64,432 మంది ఓటర్లు ఉండగా 70 పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేశారు. పోలింగ్ కేంద్రాల వద్ద ప్రత్యేక వైద్య బృందాలను అందుబాటులో ఉంచారు. వికలాంగులు, అనారోగ్యంతో బాధపడుతున్న ఓటర్ల సౌకర్యార్థం వీల్ చైర్లను ఏర్పాటు చేశారు. వృద్ధుల కోసం ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేసి ఓటు హక్కు సకాలంలో వినియోగించుకొనే విధంగా చర్యలు చేపట్టారు.

**పరిగి:** మండల వ్యాప్తంగా మొత్తం 53 పోలింగ్ బూత్‌లలో ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద బారికేడ్లను ఏర్పాటు చేశారు. ఉదయం 7 గంటల నుండే ఓటర్లు భారీగా పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు.

**క్యూలైన్‌లో టోకెన్ల పంపిణీ**

మండలంలోని పైడేటి, శ్రీరంగరాజుపల్లి, కొడిగెనహళ్లి తదితర పోలింగ్ బూత్ కేంద్రాలలో రాత్రి వరకూ పోలింగ్ కొనసాగింది. ప్రధానంగా పైడేటిలో రాత్రి 10 గంటలకు పైగా ఓటర్లు క్యూలైన్‌లో నిలబడ్డారు. సాయంత్రం 6 గంటలు దాటిన తరువాత క్యూలైన్‌లో నిలబడిన వారందరికీ ఓటు వేసే అవకాశం కల్పించారు.


గోరంట్ల ఉర్దూ పాఠశాల ప్రాంగణంలో ఓటేసేందుకు బారులు తీరిన ఓటర్లు


కొడిగెనహళ్లిలో సాయంత్రం 5 గంటల సమయంలో క్యూలైన్‌లో నిలబడిన ఓటర్లు


రొద్దంలో ఎన్నికల ప్రక్రియను పరిశీలించేందుకు వస్తున్న మంత్రి ఉషశ్రీచరణ్

**పోలింగ్ ఆఫీసర్‌పై తీవ్ర ఆగ్రహం**

మండలంలోని పైడేటి పోలింగ్ కేంద్రంలో రమణా నాయక్ అనే పోలింగ్ ఆఫీసర్ పోలింగ్ కేంద్రానికి వచ్చిన వృద్ధులు, అంధులను ఈవీఎం వద్దకు తీసుకెళ్లి టీడీపీకి ఓటు వేయిస్తున్నారన్న ఆరోపణలు రావడంతో ఓటర్లు పీఓపై తిరగబడ్డారు.దీంతో ఓటర్లకు పీఓకు మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. అక్కడున్న మిగిలిన పోలింగ్ సిబ్బంది, ప్రముఖుల జోక్యంతో వివాదం సద్దుమణిగింది.

**పైడేటిలో స్వల్ప ఉద్రిక్తత**

మండలంలోని పైడేటి పోలింగ్ కేంద్రం వద్ద సాయంత్రం 7 గంటల సమయంలో కొందరు టీడీపీ అల్లరి మూకలు ఉద్రిక్తతకు తెరలేపారు. పోలీసులు, ప్రత్యేక బలగాలు అక్కడున్న అల్లరి మూకలను చెదరగొట్టారు. తరువాత క్యూలైన్‌లో నిలబడిన వారందరికీ టోకెన్లు ఇచ్చి, ఓటు వేసే అవకాశం కల్పించారు.

**పోలింగ్ సరళిని పర్యవేక్షించిన మంత్రి**

మండలంలోని పరిగి, విట్టాపల్లి, పైడేటి పోలింగ్ కేంద్రాలను మంత్రి, వైఎస్సార్‌సీపీ అసెంబ్లీ అభ్యర్థి ఉషశ్రీచరణ్ పర్యవేక్షించారు.

**పెనుకొండ:** పెనుకొండ నగర పంచాయితీ పరిధిలో సోమవారం సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. ఏ పోలింగ్ కేంద్రంలో చూసినా ఓటర్లు బారులు తీరి మరీ ఓటు హక్కు వినియోగించుకున్నారు. పెనుకొండ మండలంలో 9 గంటలకు 9.49 శాతం, 11 గంటలకు 22.44 శాతం, 1 గంటలకు 39.50 శాతం, 3 గంటలకు 56.19, 4 గంటలకు 64.12 శాతం సాయంత్రం 5 గంటలకు 72.36 శాతం, 6 గంటలకు 75.22 శాతం ఓట్లు నమోదయ్యాయి 6 దాటిన అనంతరం ఓటర్లు మరోసారి భారీగా తరలిరావడంతో రాత్రి వరకూ పోలింగ్ కొనసాగింది. అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద టీడీపీ నాయకులు ఓటర్లను ప్రలోభపెట్టడం కనిపించింది. వెంకటరెడ్డిపల్లి పోలింగ్ స్టేషన్ వద్ద టీడీపీ నాయకులు ఓటర్ల సమీపంలోనే నిలబడి ప్రలోభాలకు పాల్పడుతున్నా పోలీసులు ఏ మాత్రం మాట్లాడలేదు. కౌన్సిలర్ గిరి మరికొందరు దొంగ ఓట్లు వేయించడానికి ప్రయత్నిస్తురని వైఎస్సార్‌సీపీ శ్రేణులు ఆరోపించడంతో వైఎస్సార్‌సీపీ– టీడీపీ వర్గీయుల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. మంత్రి ఉషశ్రీచరణ్ గ్రామానికి చేరుకుని పార్టీ శ్రేణులతో విషయాన్ని అడిగి తెలుసుకున్నారు. అంతలోనే డీఎస్పీ బాజీజాన్‌సైదా పలువురికి హెచ్చరికలు జారీ చేసారు. దీంతో వివాదం సద్దుమణిగింది. పలు కేంద్రాలతో మంత్రి ఉషశ్రీచరణ్, చరణ్‌రెడ్డి పరిశీలించారు.


శ్రీరంగరాజుపల్లిలో ఓటు వేయడానికి వీల్‌చైర్‌లో భార్య, సోదరుడి సహకారంతో వచ్చిన నాగరాజు


బ్రాహ్మణపల్లిలో వర్షంలోనే ఓటేసేందుకు నిలబడిన ఓటర్లు

## సోమందేపల్లిలో భారీ వర్షం

**సోమందేపల్లి:** మండలంలో సోమవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. కొద్ది రోజులుగా వేడిధాటికి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఒక్కసారిగా చల్లటి గాలులతో పాటు వర్షం రావడంతో వాతావరణం చల్లబడింది. రోడ్డుపై వర్షపు నీళ్లు ప్రవహించాయి. బ్రాహ్మణపల్లి, ఈదుళబలాపురం గ్రామాల్లో భారీ వర్షం కారణంగా అరగంట పాటు పోలింగ్ మందకొడిగా కొనసాగింది.


వర్షం కురుస్తున్న దృశ్యం

## క్లుప్తంగా

### టీడీపీ అభ్యర్థి హల్‌చల్

**ఓడీ చెరువు:** మండలంలోని మామిళ్లకుంట్లపల్లి పోలింగ్ బూత్ వద్ద నిబంధనలకు విరుద్ధంగా టీడీపీ అభ్యర్థి పల్లె సింధూరారెడ్డి హల్‌చల్ చేశారు. పోలింగ్ బూత్ సిబ్బందితో మంతనాలు చేశారు. సిబ్బంది కూడా పోలింగ్ నిలిపి ఆమె వెంటే పోలింగ్ బూత్ బయటకు వచ్చి సెల్ఫీలు దిగుతూ కనిపించారు. ఆ సమయంలో ఒక్క ప్రిసైడింగ్ ఆఫీసర్ మాత్రమే బూత్‌లో ఉండటంతో పోలింగ్ ఎందుకు నిలిపారంటూ ఓటర్లు ఆయన్ను ప్రశ్నించారు. ఆ తర్వాత తీరిగ్గా వచ్చిన సిబ్బంది పోలింగ్ కొనసాగించారు.

### జగరాజుపల్లిలో ఆలస్యంగా పోలింగ్


పోలింగ్ కేంద్రం వద్ద గుమికూడిన జగరాజుపల్లి గ్రామస్తులు

**పుట్టపర్తి అర్బన్:** జగరాజుపల్లి ప్రాథమిక పాఠశాల పోలింగ్ కేంద్రంలో ఈవీఎంలు మొరాయించడంతో సుమారు రెండున్నర గంటల పాటు పోలింగ్ నిలిచిపోయింది. ఉదయం 6.30 గంటలకే పాఠశాల వద్ద క్యూలో నిలుచున్నారు. ఎంతసేపటికీ గేట్లు తెరవక పోవడంతో ఇబ్బంది పడ్డారు. సుమారు రెండున్నర గంటల పాటు నిలుచున్న ఓటర్లు కేకలు వేయడం ఆరంభించారు. ఇంతలో టీడీపీ, వైఎస్సార్‌సీపీ నాయకులు అక్కడికి చేరుకొని ఆందోళన చేపట్టారు. తర్వాత ఈవీఎంలను మార్చి పోలింగ్ ప్రారంభించారు. అయినా పోలింగ్ చాలా నెమ్మదిగా జరుగుతుండడంతో గ్రామస్తులంతా పాఠశాల వద్దకు చేరుకున్నారు. సమాచారం అందుకున్న స్పెషల్ పార్టీ పోలీసులు, స్థానిక రూరల ఎస్‌ఐ సిబ్బందితో గ్రామానికి చేరుకుని అందరినీ అక్కడి నుంచి పంపేశారు.

### గోనిమేకులపల్లిలో చిన్నపాటి రగడ


గోనిమేకులపల్లి బూత్ వద్ద గొడవ పడుతున్న ఇరువర్గాలు

**రొద్దం:** మండల పరిధిలోని గోనిమేకులపల్లిలో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్ వద్ద ఇరువార్గల మధ్య చిన్నపాటి గొడవ చోటు చేసుకుంది. మహిళా పోలీస్ ఆధార్ కార్డు ఒరిజినల్ తీసుకు రావాలని ఓటర్లను ఇబ్బందులకు గురిచేస్తోదని వైఎస్సార్‌సీపీ నాయకులు ఆరోపించారు. అయితే వైఎస్సార్‌సీపీ నాయకులు బూత్ వద్ద ఎందుకు ఉన్నారని టీడీపీ వాళ్లు వాగ్వివాదానికి దిగడంతో పిడిగుద్దులు గుద్దుకున్నారు. పోలీసులు ఇరువర్గాలకు సర్దిచెప్పడంతో పోలింగ్ ప్రశాంతంగా జరిగింది.

### కొత్తచెరువులో సజావుగా పోలింగ్


కొత్తచెరువులోని పోలింగ్ కేంద్రం వద్ద బారులుదీరిన జనం

**కొత్తచెరువు:** మండలంలో సార్వత్రిక ఎన్నికల పోలింగ్ సోమవారం సజావుగా సాగింది. మండల వ్యాప్తంగా 3, 2700 ఓట్లు వుండగా సాయంత్రం 7 గంటలకు 80 శాతం పోలింగ్ జరిగినట్లు అధికారులు తెలిపారు. మరకుంటపల్లి, అప్పలవాండ్లపల్లి, కొడపగానిపల్లి, భైరాపురం గ్రామాల్లో టీడీపీ నాయకులు కవ్వింపు చర్యలకు పాల్పడ్డారు. వలంటీర్లు ఏజెంట్లుగా కూర్చోరాదని టీడీపీ నాయకులు వాదనకు దిగారు. అయితే అయితే అధికారులు అనుమతించడంతో టీడీపీ నాయకులు మిన్నకుండిపోయారు. కొత్తచెరువు నుంచి టీడీపీ మూకలు మూడు వాహనాల్లో 20 మంది కొడపగానిపల్లి పోలింగ్ కేంద్రంలోకి వెళ్లేందుకు యత్నించగా వైఎస్సార్‌సీపీ నాయకులు అడ్డుకోవడంతో వారు అక్కడి నుంచి వెళ్లిపోయారు.


పరిగిలో కొత్తగా ఓటు హక్కు వినియోగించుకున్న చంద్రకళ


పెనుకొండ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల వద్ద బారులు తీరిన ఓటర్లు


రొద్దం మండలం చెరుకూరులో రాత్రి 9 గంటలైనా ఓటు వేయడానికి క్యూలో ఉన్న ఓటర్లు


రొద్దంలో ఎన్నికల ప్రక్రియను పరిశీలిస్తున్న ఎస్పీ మాధవరెడ్డి


రొద్దం మండలం పెద్దమంతూరులో ఓటేందుకు క్యూలైన్లో నిల్చున్న ఓటర్లు

# మళ్లీ జగనన్నే సీఎం

**నల్లమాడ:** ప్రస్తుత ఎన్నికల్లో రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ విజయఢంకా మోగించి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రెండోసారి ముఖ్యమంత్రి కావడం ఖాయమని ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. స్వగ్రామం నల్లసింగయ్యగారిపల్లిలోని పోలింగ్ బూత్‌లో కుటుంబ సభ్యులతో కలిసి ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి ఓటు వేశారు. సతీమణి దుద్దుకుంట అపర్ణారెడ్డి, కుమారుడు కిషన్‌రెడ్డి, సోదరుడు దుద్దుకుంట శ్రీనివాసరెడ్డి తదితర కుటుంబ సభ్యులతో కలిసి ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి ఓటు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న అమలు చేసిన సంక్షేమ పథకాలే వైఎస్సార్ సీపీని గెలిపిస్తాయన్నారు. రైతులు, వృద్ధులు, అక్కచెల్లెమ్మలు ప్రతి ఒక్కరూ సీఎంగా జగనన్ననే కోరుకుంటున్నారని అన్నారు. గతంలో ఉత్తుత్తి హామీలతో అన్ని వర్గాలను మోసం చేసిన చంద్రబాబు మాటలను ప్రజలు నమ్మరన్నారు. పుట్టపర్తిలో తిరిగి వైఎస్సార్ సీపీ జెండా ఎగురవేస్తామని ఎమ్మెల్యే విశ్వాసం వ్యక్తపర్చారు.

**పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన ఎమ్మెల్యే**

**పుట్టపర్తి అర్బన్:** సార్వత్రిక ఎన్నికల పోలింగ్ సందర్భంగా ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి పలు పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. పుట్టపర్తి పట్టణంతో పాటు రూరల్ మండలంలోని జగరాజుపల్లి, పెడపల్లి, బత్తలపల్లి గ్రామాల్లో పర్యటించిన ఆయన పోలింగ్ సరళిని పర్యవేక్షించారు. పోలింగ్ కేంద్రాల్లోని వసతులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.


జగరాజుపల్లిలో పోలింగ్ కేంద్రాన్ని సందర్శించిన ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి

### ఇద్దరికి తీవ్రగాయాలు

**బత్తలపల్లి:** అనంతపురం–కదిరి జాతీయ రహదారిపై ఉప్పర్లపల్లి క్రాస్ వద్ద సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. వివరాలు ఇలా ఉన్నాయి. ఉరవకొండకు చెందిన అనిల్, పాండు గ్రామంలో ఓటు హక్కును వినియోగించుకుని చిత్తూరుకు బైక్‌పై పని నిమిత్తం బయలుదేరారు. ఉప్పర్లపల్లి క్రాస్ వద్దకు రాగానే జాతీయ రహదారి పనులు చేస్తున్న విషయం గమనించకుండా కంకర కుప్పను ఎక్కించి కిందపడ్డారు. తీవ్రంగా గాయపడిన వారికి స్థానికులు వెంటనే బత్తలపల్లి ఆర్డీటీ ఆసుపత్రికి తరలించారు.

### త్రుటిలో తప్పిన ప్రమాదం

**తలుపుల:** మండలంలోని తలుపుల– బత్రేపల్లి రోడ్డుపై కల్లీల మిట్ట వద్ద సోమవారం రెండు కార్లు ఢీకొన్న ఘటనలో ప్రమాదం తప్పింది. తలుపుల ఎస్ఐ దిలీప్‌కుమార్ తలుపుల వైపు నుంచి బత్రేపల్లికి వెళ్తుండగా కల్లీల మిట్ట వద్ద ఎదురుగా కారు రావడంతో ఒక్కసారిగా ఢీకొన్నాయి.

### పెనుకొండ మండలంలో..

**పెనుకొండ రూరల్:** మండలంలోని మునిమడుగు, గుట్టూరు, వెంకటగిరిపాళ్యం, దుద్దేబండ, కురుభవాండ్లపల్లి, రాంపురం, శెట్టిపల్లి, గోనిపేట, అడదాకులపల్లి, నాగళూరు, మావటూరు పంచాయతీల్లో ఎన్నికల పోలింగ్ సజావుగా సాగింది. యువకులు, మహిళలు పెద్ద ఎత్తున తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.


వెంకటగిరిపాళ్యంలో ఓటు వేసేందుకు బారులు తీరిన ఓటర్లు

### సోమందేపల్లిలో ప్రశాంతం


సోమందేపల్లిలో బారులు తీరిన ఓటర్లు

**సోమందేపల్లి:** మండల వ్యాప్తంగా పోలింగ్ సోమవారం సజావుగా జరిగింది. వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఉషశ్రీచరణ్ సోమందేపల్లిలో ఉన్న పోలింగ్ కేంద్రాలు సందర్శించారు. టీడీపీ కార్యకర్త మోహన్ పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లను ప్రభావితం చేసేల పసుపు కలర్ చొక్క ధరించి నిబంధనలకు విరుద్ధంగా ఏజెంట్‌గా కూర్చున్నాడని జెడ్పీటీసీ సభ్యుడు అశోక్, వైస్ సర్పంచ్ వేణు, అధికారులు ఫిర్యాదు చేశారు. ఇరు వర్గాలు వాగ్వాదానికి దిగడంతో పోలీసులు అక్కడికి చేరుకుని చెదర గొట్టారు. అనంతరం టీడీపీ అభ్యర్థి సవిత భర్త వెంకటేశ్వర్లు అక్కడికి చేరుకొని ఎస్ఐ విజయ్‌కుమార్‌తో తీవ్ర వాగ్వివాదానికి దిగారు.

# చెదురు మదురు ఘటనలు ఇలా...

- రొద్దం మండలం చిన్నమంతూరులో పోలింగ్ బూత్‌లో ఓట్లు వేసే విషయంలో వైఎస్సార్‌సీపీ – టీడీపీ వర్గీయులు పోటీ పడటంతో వివాదం చెలరేగింది. ఇరువర్గాల మధ్య తోపులాట జరిగింది. దీంతో పోలీసులు ఇరువర్గాలను బయటకు పంపించివేశారు.
- గోరంట్ల మండలం నార్సింపల్లి పంచాయతీ ఎర్రబల్లిలో స్లిప్పులు పంచే విషయంలో జనసేన – టీడీపీ వర్గీయుల మధ్య తోపులాట జరిగింది. పోలీసులు వెంటనే పరిస్థితిని అదుపు చేశారు.
- పరిగి మండలం బీచిగానిపల్లి పంచాయతీ పాత్రగానిపల్లిలో పోలింగ్ బూత్ బయట మద్యం తాగి ఓ యువకుడి హంగామా చేశాడు. పోలీసులతో వాగ్వివాదానికి దిగడంతో అదుపులోకి తీసుకున్నారు. కాసేపైన తర్వాత వదిలివేశారు.
- రొద్దం మండలం గోనిమేకలపల్లిలో వైఎస్సార్‌సీపీ – టీడీపీ వర్గీయుల మధ్య తోపులాట జరిగింది. వైఎస్సార్‌సీపీ నాయకుడు పోలింగ్ బూత్‌లోకి వెళ్లాడంటూ టీడీపీ వర్గీయులు వైఎస్సార్‌సీపీ నాయకులతో వాగ్వివాదానికి దిగారు. దీంతో ఇరు వర్గాల మధ్య తోపులాట జరిగింది. పోలీసులు పరిస్థితిని అదుపు చేశారు.
- రొద్దం మండలం కంబాలపల్లి పంచాయతీ షాపురంలో టీడీపీ వాళ్లు డబ్బులు పంచుతుండగా వైఎస్సార్‌సీపీ వర్గీయులు అడ్డుకున్నారు. దీంతో తమ్ముళ్లు అక్కడి నుంచి పరారయ్యారు.
- సోమందేపల్లి జెడ్పీ హైస్కూల్ బయట టీడీపీ జెండా ఉండటంపై మంత్రి ఉషశ్రీచరణ్ అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో అక్కడున్న అధికారులు వెంటనే టీడీపీ జెండాను తీయించి వేశారు.


భారీ వర్షాలకు వక్క తోటలో నిలిచిన నీరు

## గుడిబండలో భారీ వర్షం

**గుడిబండ:** మండలంలో భారీ వర్షం కురిసింది. మండల వ్యాప్తంగా ఆదివారం రాత్రి నుంచి సోమవారం ఉదయం వరకూ ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. దీంతో వక్కతోటలు, పంట పొలాల్లో భారీగా వర్షం నీళ్లు నిలిచాయి. అత్యధికంగా గుడిబండలో 46.6 మి.మీటర్ల వర్షపాతం నమోదైంది. వర్షం బాగా కురవడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.